క్లుప్తంగా

బ్రాహ్మణేశ్వరమ్మ కృషి అభినందనీయం


ప్రిన్సిపాల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మను సన్మానిస్తున్న దృశ్యం

చింతలపూడి: నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రిన్సిపాల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ చేస్తున్న కృషి అభినందనీయమని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జి.నాగరాజు కొనియాడారు. గురువారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన నూతన కమిటీ సమావేశంలో ప్రిన్సిపాల్ బ్రాహ్మణేశ్వరిని ఘనంగా సత్కరించారు. గతేడాది పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీలో పదిమంది విద్యార్థులు సీట్లు సాధించే విధంగా ప్రిన్సిపాల్ బ్రాహ్మణేశ్వరి కృషి చేశారన్నారు. పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు సహకరించాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.లక్ష్మీకుమారి, ఝాన్సీ, వైస్ చైర్మన్ లలిత, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, పరమేష్, సతీష్, లావణ్య, రమాదేవి, నాగేశ్వరి, పావని తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేత

జంగారెడ్డిగూడెం: గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థిని ఎస్ సింధుకు రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు అందించారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు ఆధ్వర్యంలో అధ్యక్షుడు షేక్ పీరూ సాహెబ్, కార్యదర్శి ఎన్.రూపాదేవి, సురేష్, రమేష్, నాని, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సామగ్రి పంపిణీ


కన్నాపురం హైస్కూల్లో భోజన సామగ్రి పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన సామగ్రి పంపిణీ చేశారు. వాసవి క్లబ్ సభ్యులు సుమారు రూ.15 వేల సౌజన్యంతో ఈ వితరణ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా రీజియన్ చైర్మన్ ఉప్పల మణికంఠ సతీష్ పేర్కొన్నారు. 140 మందికి సరిపడా సామగ్రిని అందజేసినందుకు సభ్యులను ఆయన అభినందించారు.

అలరించిన చిన్నారులు

ద్వారకాతిరుమల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాల నడుమ విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా వీటిని ప్రదర్శించారు. అలాగే పలువురు చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో కనిపించి, కనువిందు చేశారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత

వేలేరుపాడు: పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. వేలేరుపాడు హైస్కూల్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ విద్యాకమిటీ అధ్యక్షుడు కొల్లూరి సూర్యనారాయణ జ్ఞాపకార్థం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని బుర్రి నాగ మౌనికకు రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని గారపాటి వర్షినికి రూ.3వేలు విద్యాకమిటీ చైర్మన్ బేటి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కొల్లూరు సత్యనారాయణ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి జ్ఞాపకార్థం..

కుక్కునూరు: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం మాజీ సైనికుడు కుక్కునూరు బాపిరాజు నగదు బహుమతిని అందించారు. తన కుమారుడు సత్యశేషు జ్ఞాపకార్థం స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.2,116, రూ.1,116 నగదు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ద్వారకాతిరుమల: రామసింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థిని దొప్పసాని లిఖితకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్త కనికెళ్ల ధర్మరాజు గురువారం రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ జరిగిన అనంతరం ఈ నగదు బహుమతిని ఆమెకు అందించి, అభినందించారు. ఉప సర్పంచ్ ఉప్పల మునేశ్వరరావు, బిరుదుగడ్డ చల్లారావు, ఎస్ఎంసీ చైర్మన్ దొడ్డా భాస్కరరావు, సభ్యులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎందరో త్యాగధనుల ఫలం.. స్వాతంత్ర్యం

- మురిసిన మువ్వన్నెల జెండా
- అమరవీరులకు ఘన నివాళి

బుట్టాయగూడెం: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరు, నూతిరామన్నపాలెంలో గురువారం జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సేవలు, త్యాగాలు మరువలేనివని అన్నారు. బ్రిటీష్ వారిపై అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. పశ్చిమ మన్యంలో నివసిస్తున్న ఎందరో గిరిజనులు బ్రిటీష్ వారిపై పోరాటం చేశారన్నారు. బ్రిటీష్ దొరలను ముప్పుతిప్పలు పెట్టి తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన వారిలో పోలవరం మండలం కొరుటూరుకు చెందిన కారుకొండ సుబ్బారెడ్డి, ఆయన అనుచరులు కుర్ల సీతారామయ్య, కుర్లా వెంకట సుబ్బారెడ్డి, గురుగుంట్ల కొమ్మిరెడ్డితో పాటు మరెందరో ఉన్నారన్నారు. తెల్ల దొరలపై వీరోచిత పోరాటం చేసి ఉరి కంబాలపై ప్రాణాలు విడిచిన గిరిజన వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యపాలనకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొడియం లక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, నాయకులు పొడియం లక్ష్మణరావు, కిరణ్, ముదునూరి నాగరాజు, మారిశెట్టి కిషోర్, పెంటపాటి శ్రీను, విజయ్, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: నూతిరామన్నపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


పోలవరం రూరల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

వెయ్యి అడుగుల జాతీయ పతాక ప్రదర్శన

బుట్టాయగూడెంలో సుమారు 1200 మంది విద్యార్థులతో 1000 అడుగుల జాతీయ పతాకంతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యారోహిణీ డిజిటల్ స్కూల్ విద్యార్థులతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా పాల్గొని వందేమాతరం అంటూ నినదించారు. విద్యారోహిణీ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో భిన్నమతాలు, సాంప్రదాయాలు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వంగా భావించే గొప్పదేశం భారత దేశమని అన్నారు. విద్యార్థుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపేందుకు ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు.

ఏజెన్సీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కేఆర్‌పురం ఐటీడీఏలో, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద, పోలీస్ స్టేషన్, డిగ్రీ కళాశాల వద్ద, అన్ని సచివాలయాల్లో జెండాలను ఎరుగవేశారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జీలుగుమిల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జెండా ఆవిష్కరించారు.

జెండా రెపరెపలు


కుక్కునూరు: జాతీయ పతాకంతో కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో మానవహారం

కుక్కునూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుక్కునూరు సచివాలయం వద్ద సర్పంచ్ రావు మీనా జాతీయపతాకాన్ని ఎగరవేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, అటవీశాఖ కార్యాలయాల్లో అటవీరేంజ్ అధికారులు ఏడుకొండలు, తెల్లం శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పెద్దిరాజు పతాకావిష్కరణ చేశారు. కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాతో హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో విద్యార్థులు దేశభక్తి గీతాలతో నృత్యాలు ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొయ్యలగూడెం: పంద్రాగస్టు పర్వదినోత్సవ వేడుకలను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చెల్లన్నదొర పతాకావిష్కరణ చేశారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ టౌన్ యూత్ అధ్యక్షుడు ఏలేటి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్ట వనజా లక్ష్మి పతాకావిష్కరణ చేశారు. కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గంజిమాల రామారావు, ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, ఎంపీటీసీలు జాతీయ పతాకావిష్కరణ చేశారు.

వేలేరుపాడులో...

వేలేరుపాడు: 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు వేలేరుపాడు మండలంలో గురువారం ఘనంగా జరిగాయి. ఇక్కడి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భుజంగరావు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ రవిరాజు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకుడు రమేష్, తాట్కూరుగొమ్ము సచివాలయంలో సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్ జెండాను ఎరురవేశారు. జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీలు మేడవరపు నాగశ్రీ, కేసగాని వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొమ్మరాజు రాంబాబు, ఎస్‌కే షౌకత్‌హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పోలవరం మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్యాలయాల్లో వాడవాడలా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసిల్దార్ బీవీఎస్ఎల్ రాజు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ జెండా ఎగురవేశారు. గాంధీజీ, పొట్టిశ్రీరాముల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో జి.శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అందజేసిన నగదును ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అందజేశారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

ద్వారకాతిరుమల: మహాత్ముని అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ద్వారకాతిరుమల జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ అన్నారు. మండలంలోని వాడవాడల 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ శామ్యూల్, ఎమ్మార్వో కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై జి.సతీష్, పీహెచ్‌సీ వద్ద మండల వైద్యాధికారి డాక్టర్ బాలుప్రకాష్, శ్రీవారి ఆలయం వద్ద ఈఓ వేండ్ర త్రినాధరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా వారు మహాత్మా గాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి, పతాకావిష్కరణను జరిపారు. అనంతరం సిబ్బందికి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ పరసా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, రుద్ర శివాజీ, గుర్రాల లక్ష్మణ్, జంగా వెంకట కృష్ణారెడ్డి, మానుకొండ సుబ్బారావు తదితరులున్నారు.


కొయ్యలగూడెం: వైఎస్సార్ విగ్రహం వద్ద జాతీయ పతాకావిష్కరణ


వేలేరుపాడు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి


ద్వారకాతిరుమల: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్


బుట్టాయగూడెం: 1000 అడుగుల జాతీయ పతాకంతో విద్యార్థుల ప్రదర్శన

వాడవాడలా స్వాతంత్ర్య వేడుకలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయలు, పాఠశాలలు, కళాశాలలు, పలు కూడళ్లల్లో, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి జెండా ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన మూడేళ్ల కాలంలో రూ. 20 కోట్లతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశామని, మరో రూ.4కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదన సిద్ధం చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ చింతలపూడి నియోజవకర్గ కన్వీనర్ కంభం విజయరాజు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక పాతబస్టాండ్, ఇందిరానగర్ కాలనీ, జగజ్జీవన్ నగర్ 3వ సచివాలయం, హరిజనపేట సీఎస్సీ స్కూల్, పేరంపేట మీ సేవా కేంద్రం, బోసుబొమ్మ సెంటర్, గంగానమ్మగుడి వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని తరిమికొట్టి మనకు స్వాతంత్ర్యం అందించిన అమరవీరులను, త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ నేడు కొన్ని రాజకీయ పార్టీలు స్వార్థంతో కుల, మత, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ స్వాతంత్ర్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని, వాటిని యువత, ప్రజలు తిప్పికొట్టాలన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పేదలు బాగుండాలని అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పేదలకు సంక్షేమం అందేలా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, మండవల్లి సోంబాబు, బీవీఆర్ చౌదరి, ముప్పిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం: పాతబస్టాండ్ సెంటర్‌లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ జాతీయ ఎండాను ఎగురవేశారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి, బార్ సభ్యులు, కోర్టు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.
- స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కె.అద్దయ్య, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్లీవజోజి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ పి.రాజేష్, ఎస్ఈబీ స్టేషన్‌లో సీఐ వై.పట్టాభిచౌదరి, స్థానిక డిగ్రీ కళాశాలలో డాక్టర్ ఎం.ప్రసాద్, డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్సైలు జ్యోతిరాణి, సోంబాబు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.
- బిలాల్ మసీద్ సెంటర్ నందు ముస్లిం సోదరులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్గిల్ విజయ రజతోత్సవం సందర్భంగా ఆనాటి యుద్ధం లో పాల్గొన్న యుద్ధ వీరులు పి.భద్రయ్య, ఎస్.సూర్యారావు, డి.గోపాలకృష్ణ, జేవీ రాఘవరావు తదితరులను సన్మానించారు. పట్టణంలోని మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసపురంలో జాతీయ జెండాను పోల్నాటి బాబ్జి ఎగురవేశారు. అనంతరం హైస్కూల్‌లో చదువుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి గోల్డ్‌మెడల్‌ను బహూకరించారు. పంగిడిగూడెంలో టెన్త్‌లో హైస్కూల్ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి సాయినాథ్‌కి సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎంపీపీ కొదమజ్యోతి ఎగురవేశారు.

చింతలపూడి: 78 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని చింతలపూడి మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బి రాంబాబు నాయక్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ సుధాకర్, జామియ మస్జిద్ వద్ద అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు ఎస్‌డి రహీమ్ (బాబు) జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.


చింతలపూడి: మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


చింతలపూడి: జామియా మస్జిద్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ముస్లింలు


జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్

కుక్కునూరు: ప్రజల బాగుకోసం శ్రమించే వారందరూ దేశభక్తులేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్ అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కుక్కునూరు సచివాలయంలో ఆయన పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరి పనిని వారు సమర్థవంతంగా చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కోవిడ్ నుంచి నేటి వరకు పంచాయతీలో ఎన్నో విధాల సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను సత్కరించడం కర్తవ్యంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మోహన్‌రావు, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం దుస్తుల పంపిణీ


పోలవరంలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ పాడుం పుష్ప

పోలవరం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పోలవరం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ పాడుం పుష్ప, కార్యదర్శి వై.కొండలరావు యూనిఫాం దుస్తులు, పారిశుధ్య సామగ్రిని అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే కొత్తపట్టిసీమ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, కార్యదర్శి విజయకుమారి పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

వరలక్ష్మి వ్రతానికి ఆలయాలు ముస్తాబు

ద్వారకాతిరుమల: వరలక్ష్మి వ్రత వేడుకలకు జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రెండవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మి వ్రతాన్ని ముత్తైదువలు ఘనంగా జరుపుకోనున్నారు. ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శుక్రవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా దేవస్థానం సిబ్బంది గురువారం ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి బోదెలు, విశేష పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే శాకాంబరి దేవి అలంకారానికి అవసరమైన కూరగాయలను సిద్ధం చేశారు. శాకాంబరిగా దర్శనమిచ్చే అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.

ఎల్ఎన్‌డీపేటలో భారీ వర్షం

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. ప్రధాన రోడ్డు మార్గంలో పలు వీధుల్లో వర్షం నీరు ఏరులై పారింది. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.